సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



పంచాయతీ పోరుకు సై

ప్రభుత్వం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 10లో▸



అరెస్టులు అప్రజాస్వామికం

బీఆర్ఎస్ నాయకులపై రేవంత్ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ నేతలు మండిపడ్డారు. 10లో▸



ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

మాడ్గుల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏసీపీ కేవీపీ రాజు

మాడ్గుల: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, సిబ్బంది నిర్వర్తిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం మండలంలో జరిగిన స్నాచింగ్ కేసులు, గొర్ల దొంగతనం కేసుల ఛేదన విషయంలో సిబ్బంది పనితీరును అభినందించారు. ఆయన వెంట సీఐ జగదీష్ ఉన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్: రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. సంఘం కార్యాలయంలో గురువారం ఆయన అధ్యక్షతన పాలక వర్గం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 22 మంది రైతులకు రూ.2.9 కోట్ల అప్పులు మంజూరు చేశామని, నూతనంగా 19 మందిని సభ్యులుగా చేర్చుకున్నామని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి, నవంబర్ 30వ తేదీ వరకు జమ, ఖర్చులను ఆమోదించామని, దీర్ఘకాలిక వ్యవసాయ అప్పులను ఒకే సభ్యుడికి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచినట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవ రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, కొండ్రు స్వప్న శ్రీనివాస్, చాపల యాదగిరి, సీఈఓ వై.రాందాసు తదితరులు పాల్గన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నాగేందర్‌రెడ్డి



అత్తాపూర్: ఇండియన్ నేషనల్ యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అత్తాపూర్‌కు చెందిన కొండకళ్ల నాగేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆయనకు 20,515 ఓట్లు వచ్చాయి. 4,875 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా పార్టీకి నిరంతరం క్రమశిక్షణ గల కార్యకర్తలా పని చేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకలను కలుపుకొని ముందుకు సాగుతానన్నారు. తన గెలుపు కోసం కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

గర్భిణులను గుర్తించి వైద్య సలహాలు అందించాలి



మాట్లాడుతున్న డాక్టర్ పూనమ్

కొందుర్గు: గ్రామాల్లో గర్భిణులను గుర్తించి సరైన వైద్య సలహాలు అందించాలని జిల్లా మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పూనమ్ సూచించారు. కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ఆశడే సమీక్షా సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడారు. గర్భిణుల వివరాలు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించాలని అన్నారు. వారికి విధిగా ఐరన్ మాత్రలు అందించాలని, టీటీ ఇంజెక్షన్ వేయించాలన్నారు. మొదటి, రెండో పరీక్షలను పీహెచ్‌సీలో చేయించాలని.. మూడో, నాలుగో పరీక్షలు కమ్యూనిటీ ఆస్పత్రిలో చేయించాలని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని, కాన్పులు ఆస్పత్రుల్లోనే జరిగేలా చూడాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో బస్తీ దవాఖాన ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ వినోద్ కుమార్, మండల వైద్యాధికారి అమృత జోసెఫ్, డీపీఎంఓ అక్రమ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, పీహెచ్ఎన్ లుదియా, ఎంపీహెచ్ఓ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

7వ గ్యారంటీ స్పెషల్

SAKSHI INTERVIEW సాక్షి



అన్ని మండలాలకు సాగునీరు లక్ష్యం

'కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నా. నాపై వచ్చే విమర్శలను పట్టించుకోను.. ఏడాది కాలంలో ఎంతో చేశా.. వచ్చే నాలుగేళ్లలో మరెంతో చేయాల్సి ఉంది.. సీఎం రేవంత్‌రెడ్డికి కల్వకుర్తిపై ప్రత్యేకమైన అభిమానం ఉంది.. అందుకే అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఇస్తున్నారు.. ఏడాదికాలంలో వివిధ పథకాల కింద రూ.500 కోట్లు తీసుకువచ్చా. ఏడో గ్యారంటీ స్పెషల్' అంటున్నారు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి. ఎమ్మెల్యేగా ఏడాది పాలన నేపథ్యంలో 'సాక్షి'తో ముచ్చటించారు. – ఆమనగల్లు

- ఏడాదిలో రూ.500 కోట్లు తెచ్చా
- నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో చేశా
- మరో నాలుగేళ్లలో రూపురేఖలు మారుస్తా
- ఈ ప్రాంతంపై సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక అభిమానం
- 'సాక్షి'తో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ప్రశ్న: ఏడాదికాలంలో ఎమ్మెల్యేగా ఏం చేశారు?

జవాబు: ఎమ్మెల్యేగా ప్రజలు అవకాశం ఇచ్చారు. వారి కోసం ఏడాదికాలంలో ఎంతో చేశాను. సంతృప్తిగా ఉంది. నియోజకవర్గ అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తున్నాను.

ప్రశ్న: నియోజకవర్గానికి ఎన్ని నిధులు వచ్చాయి?

జవాబు: వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఏడాదికాలంలో రూ.500 కోట్లు మంజూరయ్యాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు వచ్చాయి. బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.204 కోట్లు ఇప్పటికే మంజూరుకాగా, మరో రూ.200 కోట్లు రానున్నాయి.

ప్రశ్న: ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏడో గ్యారంటీ మాటేమిటి?

జవాబు: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలతో ప్రజల ముందుకు వచ్చింది. వాటితో పాటు నేను 7వ గ్యారంటీగా నియోజకవర్గానికి సాగునీరు తెస్తానని హామీ ఇచ్చా. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ82 కాలువ ద్వారా కల్వకుర్తి, వెల్దండ, ఆమనగల్లు, మాడ్గుల మండలాలకు 35 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నాం. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేసి ఆమనగల్లు మండలం వరకు సాగునీరు తీసుకువచ్చాం. యాసంగి పంటకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా అన్ని మండలాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఏం తీసుకువచ్చారు?

జవాబు: నియోజకవర్గానికి ప్రత్యేకంగా ప్రభుత్వం యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసింది. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో స్కూల్‌కోసం 25 ఎకరాలు భూమి కేటాయించడం జరిగింది. రూ.125 కోట్లతో నిర్మించనున్నాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

ప్రశ్న: వైద్యరంగం కోసం ఏం చేస్తున్నారు?

జవాబు: వైద్యరంగం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆమనగల్లు పట్టణంలో రూ.17.5 కోట్లతో ప్రభుత్వాస్పత్రి నూతన భవనం నిర్మిస్తున్నాం. కల్వకుర్తిలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తున్నా. అన్ని మండల కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించనున్నాం.

ప్రశ్న: ఆమనగల్లులో పెండింగ్ పనులకు మోక్షం కలుగుతుందా?

జవాబు: ఆమనగల్లు పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగాయి. పనులు పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందులు తీరుస్తాం. డిగ్రీ కళాశాలకు నూతన భవనం నిర్మిస్తాం. రోడ్డు విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తా.

ప్రశ్న: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించారా?

జవాబు: నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. మరో వెయ్యి అదనంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. త్వరలో నిర్మాణం ప్రారంభిస్తా.

ప్రశ్న: విమర్శలకు ఏం సమాధానం చెప్తారు?

జవాబు: ఎమ్మెల్యేగా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నా. విమర్శలను ఏ మాత్రం పట్టించుకోను. వాటికి సమాధానం చెబుతూ పోతే అభివృద్ధిపై దృష్టి సారించలేను.

ప్రశ్న: అభివృద్ధి పనుల కోసం సీఎంను కలుస్తారా?

జవాబు: ఇప్పటికే కల్వకుర్తిలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కల్వకుర్తికి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒకరు కసిరెడ్డి అయితే మరో ఎమ్మెల్యే తాను అంటూ ప్రకటించారు. ఈ ప్రాంతానికి చెందిన ఆయనకు ప్రత్యేక అభిమానం ఉంది. ఇక్కడి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అభివృద్ధి కోసం స్వయంగా కలిసి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరుతా. ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ధ్యేయం.



మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకులంలో విద్యార్థులతో మాట్లాడుతున్న గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి వర్షిణి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

విద్యార్థుల భోజనంలో రాజీవద్దు

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి అలుగు వర్షిణి

మొయినాబాద్: విద్యార్థులకు పెట్టే భోజనంలో రాజీ పడొద్దని.. నాణ్యమైన భోజనం పెట్టాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి అలుగు వర్షిణి అన్నారు. మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాల, చిలుకూరు గురుకుల బాలుర పాఠశాలలను గురువారం రాత్రి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం బాగుందా.. మెనూ ప్రకారం పెడుతున్నారా.. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. భోజనం ఒక్కోసారి సరిగా ఉండటం లేదని.. ఉదయం పూట స్నానం చేయడానికి వేడినీళ్లు సరిగా రావడంలేదని.. ల్యాబ్ సరిగా లేదని.. ఎంసెట్, నీట్ కోచింగ్ ఇప్పించాలని విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తేవాలని చెప్పారు. చిలుకూరు గురుకులంలో విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. ఆమె వెంట చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతోపాటు టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాంరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సత్యనారాయణ, నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, మహేందర్ ముదిరాజ్, రాజుగౌడ్, రమేష్, రియాజ్ తదితరులు ఉన్నారు.

భూసార పరీక్షపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

ఆమనగల్లు: రైతులు భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని రాముసుంతల రైతు వేదికలో వ్యవసాయ శాఖ, ఆచార్య జయ శంకర్ వ్యవసాయ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు భూసార పరీక్షపై అవగాహన కల్పించారు. అంతకు ముందు జరిగినన సమావేశంలో వ్యవసాయాధికారి నర్సింహారావు మాట్లాడారు. విచక్షణ రహితంగా ఎరువులను వాడొద్దని సూచించారు. నేల స్వభావానికి అనుగుణంగా వాడి అధిక దిగుబడులు పొందాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త దామోదర రాజు భూసార పరీక్షల ఆవశ్యకత గురించి వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త మాధవి పంటల్లో ఎరువులు వాడే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ అదిలక్ష్మి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీఓ మాధురి, ఏఈఓలు పాల్గొన్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వంటశాల

నేడు కొడంగల్‌లో మంత్రుల పర్యటన

- భారీ వంటశాలను ప్రారంభించనున్న అమాత్యులు

కొడంగల్: పట్టణంలో శుక్రవారం రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ తదితరులు పర్యటించనున్నారు. స్థానిక మార్కెట్ యార్డులో నిర్మించిన భారీ వంటశాల (సెంట్రలైజ్‌డ్ కమ్యూనిటీ కిచెన్)ను వీరు ప్రారంభిస్తారు. కొడంగల్ నియోజకవర్గంలోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 28వేల మంది విద్యార్థులకు రోజూ ఉదయం పూట అల్పాహారం అందించనున్నారు. హరేరామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్టుకు బాధ్యతను అప్పగించారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని వసతులతో కూడిన వంటశాలను సిద్ధం చేశారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా సీఎం నియోజకవర్గమైన కొడంగల్‌ను ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు పౌష్టికాహారం అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే రోజూ ఉదయం పూట విద్యార్థులకు న్యూట్రీషనల్ ఫుడ్‌ను అందించడానికి ఏర్పాట్లు చేశారు.

విమానంలో గోల.. ఠాణాలో రభస

వ్యక్తిపై కేసు నమోదు



పోలీసుల అదుపులో నర్సింహులు

శంషాబాద్: విమానంలో గోల చేయడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఎయిర్‌లైన్స్ అధికారులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిని ఠాణాకు తీసుకురాగా అక్కడ కూడా నానా రభస చేసిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు.. ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా మాసాయిపేట గ్రామానికి చెందిన నర్సింహులు ఓ ప్రైవేటు కంపెనీ తరపున లేబర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల మాల్దీవుల్లో లేబర్‌గా పని చేసిన నర్సింహులు అక్కడి నుంచి బెంగళూరు వచ్చాడు. అక్కడి నుంచి ఇండిగో విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరాడు. బోర్డింగ్ జరిగిన సమయం నుంచి నర్సింహులు ఎయిర్‌లైన్స్ అధికారులతో వాగ్వాదానికి దిగాడు. అంతేకాకుండా.. సిగరెట్ తాగే ప్రయత్నం కూడా చేయడంతో అధికారులు వారించారు. విమానంలో ఎయిర్ హోస్టెస్‌తో అసభ్యంగా వ్యవహరించడంతో వారు రాత్రి ఒంటి గంట సమయంలో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడ కూడా పోలీస్‌స్టేసన్‌లో నానా రభస చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

'ఎడ్లకంచె' ఎన్నటికి తెగేనో!

- తాడిపర్తిలో 'ఫార్మా' పరిహారంపై వివాదం
- స్థానికేతరులకు ఇచ్చారని గ్రామస్తుల ఆరోపణ
- నిగ్గు తేల్చాలని లోకాయుక్తలో ఫిర్యాదు
- కబ్జాలో ఉన్న రైతులకు న్యాయం చేయాలని వినతి
- ఈ నెల 30న నివేదిక ఇవ్వనున్న రెవెన్యూ అధికారులు!



ఎడ్లకంచెలోని భూమి

యచారం: 'ఎడ్లకంచె' వ్యవహారం ఎన్నటికి తెగుతుందా అని తాడిపర్తి గ్రామస్తులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఫార్మాసిటీకి సేకరించిన ఎడ్లకంచె (భూదాన్) భూమిపై సమగ్ర విచారణ చేపట్టి అవకతవకలపై నిగ్గు తేల్చాలని ఆ గ్రామస్తులు కొద్ది నెలల క్రితం లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వేనంబర్ 104లో 250 ఎకరాల భూదాన్ భూమి ఉంది. ఆచార్య వినోభాబావే నేతృత్వంలో 1954లో జరిగిన భూదానోద్యమంలో తాడిపర్తి గ్రామానికి చెందిన బొక్క సీతారెడ్డి కుటుంబ సభ్యులు సర్వేనంబర్ 104లో తమ పేరిట ఉన్న 250 ఎకరాలను సర్వోదయ భూదాన్ యజ్ఞ బోర్డుకు దానం చేశారు. పర్యవేక్షణ చేసి, రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాల్సిన అప్పటి అధికారులు నిర్లక్ష్యంగా వ్యహరించారు. యాచారం తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ రికార్డుల్లో 2020 వరకు భూదాన్ భూమిగా నమోదు చేయలేదు. నగరంలోని భూదాన్ యజ్ఞబోర్డు రికార్డుల్లో మాత్రం భూదాన్ భూమిగా నమోదు చేసి ఉండడం విశేషం.

అభ్యంతరం తెలిపినా..

సదరు భూమిని ఫార్మాసిటీకి సేకరించే సమయంలో గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆ భూమిలో ఏళ్లుగా గ్రామంలోని పలువురు పేద రైతులు సాగు చేసుకోగా, మరికొందరు తమ పాడి పశువులు, మేకలు, గొర్రెలను మేపుకొంటూ జీవనోపాధి పొందేవారు. అలా ఈ భూమిని గ్రామస్తులు ఎడ్లకంచెగా పిలిచేవారు. ఇక్కడ అసైన్డ్ పట్టాలివ్వాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు పోరాటాలు చేశారు. కొందరు కేసుల పాలై జైలుకు కూడా వెళ్లారు. 2020–22 మధ్య భూదాన్ భూమిని ఫార్మాసిటీకి సేకరించే విషయంలో అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటు చేశారు. సభలో గ్రామస్తులు అది భూదాన్ భూమి అని, రికార్డులో ఉన్న రైతులు స్థానికేతరులని, పరిహారం ఇవ్వరాదని తేల్చిచెప్పారు. సభను అడ్డుకున్నా ఫలితం లేకపోయింది.

169 ఎకరాలకు పరిహారం

78 మంది స్థానికేతరులైన కొంతమందికి ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున, మరికొంత మంది రైతులకు రూ.16 లక్షల చొప్పున పరిహారం ఇచ్చారు. మొత్తం 250 ఎకరాల భూదాన్ భూమికి గాను 53 ఎకరాల అటవీ భూమి ఉందని, 24 ఎకరాల్లో బంధం చెరువు విస్తరించి ఉందని, మరో 5 ఎకరాలు పోచమ్మ దేవాలయ నిర్మాణానికి వదిలి, 169 ఎకరాలకు పరిహారం అందజేశారు. పరిహారం పొందిన స్థానికేతరులకు మీరాఖాన్‌పేటలో ఇవ్వనున్న ఫార్మా ప్లాట్లపై గ్రామస్తుల ఆందోళనతో సర్టిఫికెట్ల పంపిణీని రద్దు చేశారు. అనంతరం గ్రామస్తులు భూదాన్ భూమి వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేశారు. అప్పటి ఆర్డీఓ పెద్ద మొత్తంలో ముడుపులు స్వీకరించి స్థానికేతరులైన, రాజకీయ పలుకుబడి కలిగిన పెద్దలకు రూ. కోట్లాది పరిహారం అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

లోకాయుక్తలో ఫిర్యాదుతోనైనా..

ఎడ్లకంచె ఫార్మా పరిహారం అక్రమాలకు సంబంధించి లోకాయుక్తలో ఫిర్యాదుతోనైనా న్యాయం జరిగేనా అని తాడిపర్తి గ్రామస్తులు ఆశతో ఉన్నారు. 169 ఎకరాలకు సంబంధించి సమగ్ర విచారణ చేయాలని.. పరిహారం పొందిన స్థానికేతరులు ఏ రైతుల నుంచి ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.. రికార్డుల్లో ఎలా వారి పేర్లు నమోదు చేశారనే విషయమై నిగ్గు తేల్చాలని లోకాయుక్తలో చేసిన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. లోకాయుక్త నోటీసుల నేపథ్యంలో ఈ నెల 30న జిల్లా రెవెన్యూ అధికారులు పూర్తి సమాచారం సేకరించి నివేదిక అందజేయనున్నట్లు తెలిసింది. స్థానికేతరుల నుంచి పరిహారం రికవరీ చేసి ఏళ్లుగా ఎడ్లకంచెలో సాగులో ఉండి జీవనోపాధి పొందుతున్న తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమగ్ర విచారణ జరపాలి



భూదాన్ భూమిపై సమగ్ర విచారణ జరపాలని లోకాయుక్తలో ఫిర్యాదు చేశాం. ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో ఆ భూమిని ఫార్మాకు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశాం. హైకోర్టులో కేసులు కూడా వేశాం. అయినా అధికారులు పట్టించుకోకుండా స్థానికేతరులకు పరిహారం ఇచ్చారు. సమగ్ర విచారణ జరిపి కబ్జాలో ఉన్న స్థానికులకు న్యాయం చేయాలి.

– దూస రమేష్, మాజీ సర్పంచ్, తాడిపర్తి

వివరాలు సేకరిస్తాం



ఉన్నతాధికారుల ద్వారా వివరాలు తెప్పించుకుంటా. గతంలో గ్రామస్తుల అభ్యంతరాలతోనే పరిహారం ఇచ్చిన వారికి మీరాఖాన్‌పేట హెచ్ఎండీఏ వెంచర్‌లో ప్లాట్ల సర్టిఫికెట్లు నిలిపేశాం. ఏ ఆధారంగా ఫార్మాసిటీ పరిహారం ఇచ్చారనే విషయమై రికార్డులు పరిశీలించి, పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పార్టీలకు అతీతంగా అన్నిప్రాంతాల అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- రూ.15కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని తెలిపారు. పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం పరిధి కుంట్లూర్, పెద్ద అంబర్‌పేట, పసుమాముల గ్రామాల్లో రూ.15కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం చైర్‌పర్సన్ పండుగల జయశ్రీ, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ, కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని, పరిధి నాలుగు పురపాలికలను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, కౌన్సిలర్లు అనుపమ, కృష్ణారెడ్డి, మురళీధర్ రెడ్డి, శ్రీనివాస్, విద్య, రాజేందర్, గీత, మణెమ్మ, హరిశంకర్, సుజాత, అనురాధ, దేవిడి గీత, కోఆప్షన్ సభ్యులు శంకరయ్య, సయ్యద్ హజారే బేగం, ఖలీం, మేనేజర్ కిరణ్, శానిటరి అధికారి దశరథ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయండి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, సభ్యులు గురువారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషిచేయాలని సభ్యులకు సూచించారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తానని హామీఇచ్చారు.

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌ను కలిసిన వీఆర్‌ఏలు

షాద్‌నగర్ రూరల్: తమ సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వీఆర్‌ఏలు కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వీఆర్‌ఏలను ఇతర శాఖల్లోకి పంపించడంతో జీవితాలు ఛిన్నాభిన్నం అయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు.

పంచాయతీ పోరుకు సై

మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణకు ప్రతిపాదనలు

- వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం
- త్వరలో రిజర్వేషన్లు ప్రకటించే అవకాశం



సర్దార్‌నగర్ పంచాయతీ కార్యాలయం

షాబాద్: పంచాయతీ ఎన్నికల సందడి మొదలవుతోంది. పల్లె పోరులో భాగంగా ప్రభుత్వ ఆదేశం మేరకు.. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ బృందం జిల్లాల వారీగా చేపట్టిన అభిప్రాయ సేకరణ పూర్తయింది. దీనికి తోడు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా పూర్తి వివరాలు సేకరించారు. ఈక్రమంలో పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటరు జాబితాను రూపొందించారు. ఎన్నికల నిర్వహణలో కీలకమైన బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. మండలాల్లో భద్రపర్చిన బ్యాలెట్ బాక్సులను జిల్లా కేంద్రానికి తెప్పించి, శుభ్రం చేయించే పనులు చేపట్టారు. అనంతరం వీటిని తిరిగి పంపిస్తారు. జిల్లా వ్యాప్తంగా 546 గ్రామ పంచాయతీలు ఉండగా.. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలోనే ఆయా జీపీల రిజర్వేషన్లను ప్రకటించే అవకాశం ఉంది.

ప్రభుత్వ ఆదేశాలే తరువాయి..



ప్రభుత్వం ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేశాం. ఎన్నికల సంఘం ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా ఎన్నికలకు సర్వం సిద్ధం చేస్తున్నాం.

– అపర్ణ, ఎంపీడీఓ షాబాద్

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవికాంత్‌గౌడ్



కడ్తాల్: యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండల పరిధి ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన పాలకుర్ల రవికాంత్‌గౌడ్ నియమితులయ్యారు. ప్రస్తుతం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గత ఆగస్టులో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల పోటీల్లో రవికాంత్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ మేరకు బుధవారం వెలువడిన ఫలితాల్లో ఆయన ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రవికాంత్ మాట్లాడుతూ.. తనను ఆదరించిన యువజన శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువజన కాంగ్రెస్ శ్రేణులను సన్నద్ధం చేస్తానని పేర్కొన్నారు.

‘వడ్డెర’ల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర నాయకులు

సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి

కడ్తాల్: వడ్డెర కులస్తుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు దేరంగుల జ్యోతి డిమాండ్ చేశారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు పిలుపు మేరకు గురువారం సంఘం నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించారని తెలిపారు. అంతే కాకుండా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నిధులు కేటాయిస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగార్జున, బోసురవి, గండికోట నర్సింహ, యాదయ్య, వెంకటేశ్, జంగయ్య, రాజు, వెంకటేశ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి సీఎం కప్ క్రీడోత్సవాలు

మంచాల: ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు మండల స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్–2024 క్రీడోత్సవాలను నిర్వహించనుందని ఎంపీడీఓ బాల శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనే వారు 14నుంచి 18 సంవత్సరాల మధ్య ఉండాలని వెల్లడించారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా తదితర పోటీలు ఉంటాయన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జోనల్, జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 7వ తేదీ లోపు ఆయా గ్రామాల్లోని జీపీ కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని వెల్లడించారు. లేదా ఆరుట్ల పీఈటీ శేఖర్‌ను ఫోన్ 99489 38506 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అక్రమ బ్లాస్టింగ్‌కు పాల్పడిన వ్యక్తుల అరెస్ట్

యాచారం: వ్యవసాయ పొలంలో అక్రమ బ్లాస్టింగ్‌కు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. 9 డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి చౌదర్‌పల్లి గ్రామంలోని ఓ వ్యవసాయ పొలంలో శేఖర్‌రెడ్డి, వెంకటేశ్, రాజు అనే ముగ్గురు వ్యక్తులు అక్రమంగా బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఘటనా స్థలికి వెళ్లి సోదాలు చేపట్టగా.. పేలుడుకు ఉపయోగించే డిటోనేటర్లు లభించాయి. దీంతో నిందితులతో పాటు పేలుడు సామగ్రి, ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జబర్దస్త్ యాక్టర్ కారు ఢీ

పహాడీషరీఫ్: జబర్దస్త్ యాక్టర్ రాంప్రసాద్ (ఆటో రాంప్రసాద్) కారు అవుటర్ రింగ్ రోడ్డుపై మరో కారును ఢీకొట్టింది. ఈ ఘటన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలికి చెందిన వీరేంద్ర సిన్హా, కళ దంపతులు సూర్యాపేట నుంచి కారులో గచ్చిబౌలికి వెళ్తున్నారు. తుక్కుగూడ వద్ద వెనకనుంచి వచ్చిన రాంప్రసాద్ కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో వీరేంద్ర భార్యకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో రాంప్రసాదే వాహనం నడుపుతున్నట్లు తెలిసింది. కేసు దర్యాప్తులో ఉంది.

కులాంతర వివాహాల రక్షణ చట్టం తేవాలి

- కుల,మత దురహంకార హత్యలను అరికట్టాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



రాయపోల్ గ్రామంలో శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: కుల, మతాంతర వివాహాల చట్టాలు తీసుకురావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కాడిగాళ్ల భాస్కర్‌లు డిమాండ్ చేశారు. ఇటీవల హత్యకు గురైన కానిస్టేబుల్ నాగమణి భర్త శ్రీకాంత్‌ను రాయపోల్‌లోని వారి నివాసంలో గురువారం నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీకాంత్.. నాగమణిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేని ఆమె సోదరుడు పరమేశ్ నాగమణిని హత్యచేయడం బాధకరమన్నారు. తక్కువ కులం వాడిని పెళ్లి చేసుకున్నందునే ఆమెను అంతమొందించాడని పేర్కొన్నారు. కుల దురంహకార హత్యను ఆస్తి తగదాగా చిత్రీకరించడం సరైందికాదన్నారు. మృతిరాలి పేరుపై ఉన్న భూమిని గతంలోనే నిందితుడికి ఇచ్చినట్లు ఆధారాలున్నాయని వెల్లడించారు. కులం తక్కువ కారణంగానే హత్య జరిగిందని, కుల దురహంకార హత్యలను అరికట్టడానికి ప్రత్యేకమైన చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘాతుకానికి పాల్పడిన పరమేష్, అతనికి సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామేల్, యాదయ్య, జంగయ్య, జగన్, మండల కార్యదర్శి బుగ్గరాములు, నాయకులు జగన్, భిక్షపతి, రమేష్, యాదగిరి, చరణ్, యాదయ్యలు పాల్గొన్నారు.

పట్టుదలకు విజయం దాసోహం

- ఏడాది కాలంలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సౌమ్యారెడ్డి
- కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూనే జేఎల్‌గా ఎంపికైన సుదర్శన్



సౌమ్యారెడ్డి



సుదర్శన్

చేవెళ్ల /మొయినాబాద్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగ సాధన కత్తిమీద సాము లాంటిదే. కానీ పట్టుదలకు శ్రమ తోడైతే సాధించలేనిది ఏదీ లేదని పలువురు నిరూపిస్తున్నారు. మొయినాబాద్ మండలం చిలుకూరుకు చెందిన గడ్డం సౌమ్యారెడ్డి ఏడాది కాలంలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకుంది. గురుకుల టీజీటీ, పీజీటీ, జేఎల్‌తో పాటు గత బుధవారం విడుదలైన ఫలితాల్లో గెజిటెడ్ హోదా కలిగిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైంది. 2014లో వివాహం జరిగిన అనంతరం భర్త శ్రీధర్‌రెడ్డితో కలిసి చిలుకూరులో ఉంటూ డిగ్రీ, పీజీ ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసింది. 2022లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ సాధించింది. ప్రస్తుతం ఇద్దరు పిల్లల పోషణను చూసుకుంటూనే పట్టుదలగా చదివి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

ఉద్యోగం చేస్తూనే..

చేవెళ్ల మండలం అంతారం గ్రామానికి చెందిన సుదర్శన్ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. 2018లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిన ఆయన.. ప్రస్తుతం గచ్చిబౌలి పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. కానీ ప్రొఫెసర్ కావాలనే తల లక్ష్యాన్ని మరవలేదు. జాబ్ చేస్తూనే చదువు కొనసాగిస్తూ 2022లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నాడు. ఈక్రమంలో తెలంగాణ సాహితీవేత్తలు, హృదయ ఘోష, స్వాతంత్ర్య సమరయోధుడు అడ్డూరి అయోధ్య రామయ్య అనే పుస్తకాలు రచనలు చేశాడు. గెజిటెడ్ అధికారిగా ఎదగాలనే ఆలోచనతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వేసిన జూనియర్ లెక్చరర్ పరీక్షలు రాసి, జేఎల్‌గా ఎంపికయ్యాడు. సామాన్య పేద కుటుంబానికి చెందిన తనను తల్లిదండ్రులు జంగమ్మ, పర్మయ్య చాలా కష్టపడి చదివించారని తెలిపాడు. లెక్చరర్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందని, ప్రొఫెసర్ కావాలనే తన కల సాకారానికి మొదటి అడుగు పడిందని చెప్పాడు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

మీర్‌పేట: తప్పిపోయిన బాలున్ని మీర్‌పేట పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. నందనవనం వాంబేకాలనీకి చెందిన సంజప్ప, సుకన్యల కుమారుడు యువరాజు(9)కి మతిస్థిమితం సరిగ్గా లేదు. బుధవారం రాత్రి ఆడుకునేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లి దారితప్పాడు. జిల్లెలగూడ స్వాగత్‌గ్రాండ్ వద్ద పెట్రోలింగ్ సిబ్బంది గమనించి వివరాలు అడగగా.. సరిగా చెప్పలేదు. దీంతో బాలున్ని చేరదీసి స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఠాణాకు రాగా.. యువరాజును వారికి అప్పగించారు

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం

ఎంపీడీఓ అపర్ణ



ఎంఈఓ శంకర్‌రాథోడ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ అపర్ణ తదితరులు

షాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. గత ఆరు సంవత్సరాలుగా షాబాద్ ఎంఈఓగా పనిచేసి ఇటీవల బదిలీపై రాజేంద్రనగర్ మండలానికి వెళ్లిన ఎంఈఓ శంకర్‌రాథోడ్‌కు పీఆర్టీయూ టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులందరితో కలిసి ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థులకు మెరుగైన విద్యనందించేలా ఎంఈఓ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి , మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్ రెడ్డి, కృష్ణ, రాష్ట్రబాధ్యులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

భగీరథ నీటితోనే ఆరోగ్యం



భగీరథ నీటిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

చేవెళ్ల: ప్రజలు ఆర్‌ఓ ఫిల్టర్ వాటర్ తాగడంతో అనారోగ్యాల బారినపడే ప్రమాదం ఉందని, ప్రజలకు ప్రభుత్వం ఇంటింటికీ నల్లా కనెక్షన్ ద్వారా అందించే మిషన్ భగీరథ నీరే శుద్ధమైన, స్వచ్ఛమైన నీరు అని గ్రామీణ నీటి సరఫరా శాఖ జిల్లా కార్యాలయం అధికారి, చేవెళ్ల ఇన్‌చార్జి అధికారి శ్రీనివాస్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం మిషన్ భగీరథ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల, దేవునిఎర్రవల్లి గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి కాలనీల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం కోసమే ప్రభుత్వం మిషన్ భగీరథ నీటిని శుద్ధిచేసి అందిస్తుందని చెప్పారు. ఫిల్టర్ వాటర్‌తో ప్రజలకు అనేక అనారోగ్య సమస్యలను తెచ్చిపెడతాయని గుర్తించాలన్నారు. ప్రజలు తప్పనిసరిగా మిషన్ భగీరథ నల్లా ద్వారా వచ్చే నీటినే తాగాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంజనీర్లు గీతా స్రవంతి, జాహ్నవి, టెక్నిషియన్ హరికృష్ణ, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, నాయకులు శైలజ, వసంతం, సమత, పాండురంగారెడ్డి, నరోత్తం రెడ్డి, దేవునిఎర్రవల్లి మాజీ సర్పంచ్ మానిక్యరెడ్డి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

- బీఆర్‌ఎస్ నేతల ఆందోళన
- ఇబ్రహీంపట్నంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన



ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్ నేతల నిరసన

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులపై రేవంత్ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డిని అక్రమంగా, అప్రజాస్వామికంగా అరెస్టు చేశారని నిరసిస్తూ గురువారం ఇబ్రహీంపట్నంలో ఆందోళన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏడాది పాలనలో సాధించింది ఏమీ లేదన్నారు.

రాష్ట్రంలో పోలీసుల రాజ్యం

షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పాలనలో పోలీసులు రాజ్యమేలుతున్నారని రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులను అకారణంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావును ఓ కానిస్టేబుల్ బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విజయోత్సవాలు జరుపుకొంటున్న కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు మరో ఉద్యమం చేపట్టేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమవుతోందని తెలిపారు.